సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 4 । అక్టోబర్ । 2025



రూ.10 లక్షల ఆభరణాల సమర్పణ

కిర్లంపూడి: చిల్లంగిలోని అష్టలక్ష్మీ సమేత లక్ష్మీ నారాయణ స్వామి ఆలయానికి గ్రామానికి చెందిన సంపర సుధాకర శ్రీవినాయక్‌వర్మ రూ.10 లక్షల బంగారు ఆభరణాలు సమర్పించారు.




రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

పెరవలి మండలం నల్లాకులవారిపాలెం వద్ద జాతీయ రహదారిపై మోటార్ సైకిల్‌ను కారు ఢీకొని, ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

10లో

డెల్టాలకు 13 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: ఖరీఫ్ పంట అవసరాల నిమిత్తం కాటన్ బ్యారేజీ నుంచి డెల్టాలకు శుక్రవారం 13 వేల క్యూసెక్కుల గోదావరి జలాలను విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,400, మధ్య డెల్టాకు 2,100, పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యులుగా మాజీ ఎంపీ అనురాధ

సాక్షి, అమలాపురం: వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) సభ్యులుగా అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోనసీమ జిల్లా చెందిన నలుగురిని సీఈసీ సభ్యులుగా ఎంపిక చేశారు. చింతా అనురాధతో పాటు పి. గన్నవరం మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, పార్టీ సీనియర్ నాయకులు పేరి కామేశ్వరరావు, పితాని బాలకృష్ణలను నియమించారు. వీరితో పాటు జిల్లాకు చెందిన ఐదుగురిని స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కొత్తపేట నియోజకవర్గానికి చెందిన సాకా మణికుమారి, అమలాపురం నియోజకవర్గానికి చెందిన కుడిపూడి వెంకటేశ్వరరావు (బాబు), కుడుపూడి భరత్ భూషణ్, పి. గన్నవరం నియోజకవర్గానికి చెందిన నేలపూడి స్టాలిన్‌బాబు, ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన కాశీ ముని కుమారిని ఎంపిక చేశారు.

గాంధీజీ స్ఫూర్తితో సాగాలి



కలెక్టరేట్‌లో గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: గాంధీజీ జయంతి మనకు మానవతా విలువలు, శాంతి, సత్యం, అహింసా మార్గాల పట్ల నిబద్ధతను గుర్తు చేస్తుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో జాతిపిత మహాత్మాగాంధీ 156వ జయంతి సందర్భంగా గురువారం ఆయన కాంస్య విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ గాంధీజీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని వ్యక్తిగత జీవితంలోను, సమాజంలోను ఆయన విలువలను పాటించడానికి ప్రయత్నించాలన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి ఏవో కాశీ విశ్వేశ్వరరావు, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ పాల్గొన్నారు.

7న ఫ్యాప్టో పోరుబాట




మహాధర్నా పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

అమలాపురం టౌన్: విజయవాడలో ఈ నెల 7న జరగనున్న ఫ్యాప్టో పోరుబాట నిరసన కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల ఆర్థిక, ఇతర సమస్యలపై రాష్ట్ర ఫ్యాప్టో తలపెట్టిన ఈ మహా ధర్నాకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి అన్ని యూనియన్లకు చెందిన ఉపాధ్యాయులు విధిగా హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అమలాపురంలోని ఎస్టీయూ జిల్లా విద్యా భవనంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి ఉపాధ్యాయుల సన్నాహక సమావేశంలో సాయి శ్రీనివాస్ మాట్లాడారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎంటీవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం నేటి ఉపాధ్యాయులు ఈ కూటమి ప్రభుత్వంలో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించింది. 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయకపోవడం తదితర సమస్యలపై ఉపాధ్యాయులు నిరసన బాట పట్టారని ఆయన గుర్తు చేశారు. ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ పోతంశెట్టి దొరబాబు, సంఘ ప్రతినిధులు మోకా ప్రకాష్, రాయుడు ఉదయభాస్కర్, నాగిరెడ్డి శివ ప్రసాద్ ప్రసంగించారు. నిరసన పోరు పోస్టర్లను విడుదల చేశారు.

అండర్ -14, 17 బాలబాలికలకు ఎంపికలు

అమలాపురం రూరల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్ -14, 17 బాల బాలికలకు ఈనెల 4 ,7 తేదీలలో క్రీడా పోటీలు, జిల్లా జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీంబాషా ఒక ప్రకటనలో తెలిపారు. 4 వ తేదీన ఆత్రేయపురం మహాత్మాగాంధీ ఉన్నత పాఠశాలలో నెట్‌బాల్ ఎంపికలు, 7 వ తేదీన మలికిపురం మండలం గుడిమెళ్ళంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాల్కాంబ్ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు ఉదయం 9 గంటలలోపు రిపోర్ట్ చేయాలని డీఈవో కోరారు. ఇతర వివరాలకు ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు కొండేపూడి ఈశ్వరరావు సెల్ నెంబర్ 93469 20718, ఎన్ఎస్ రమాదేవి సెల్ నెంబర్ 94400 94984 సంప్రదించాలన్నారు.

ప్రయాణికులపై.. లూటీచార్జ్!



- జేబులకు దసరా చిల్లు
- అమలాపురం నుంచి హైదరాబాద్ టికెట్ ధర రూ.2 వేలు
- ఆదివారం రూ.4 వేల నుంచి రూ.5 వేలు
- చేతులెత్తేసిన ప్రభుత్వం
- ఆర్టీసీ ప్రత్యేక బస్సులు తక్కువే

సాక్షి, అమలాపురం: దసరా పండగకు కొనుగోలు చేసిన వస్త్రాలు, పిండి వంటలు, సంబరాలకు అవుతున్న ఖర్చుల కన్నా దూర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లేందుకు అవుతున్న ప్రయాణ ఖర్చులే అధిక భారంగా మారాయి. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి మహానగరాలలో ఉంటున్న వలస పక్షులు సొంత ప్రాంతాలకు పండగలకు రావడం ఇప్పుడు తలకుమించిన భారమవుతోంది. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు అరకొరగా ఏర్పాటు చేయడంతో ఇదే అదనుగా ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు టిక్కెట్ రేట్లు రెండు, మూడు రెట్లు చేసి అడ్డుగోలుగా దోపిడీ చేస్తున్నారు.

ఆకాశమే హద్దు

ఉద్యోగ, ఉపాధి, ఉన్నత చదువుల కోసం సుదూర ప్రాంతాల్లో ఉంటున్నవారు దసరా వంటి పండగలకు జిల్లాకు వస్తారు. సంక్రాంతి తరువాత ఎక్కువ మంది వచ్చేది దసరా పండగకే. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఎక్కువ మంది వస్తారు. కాని ఈసారి రాకపోకల ఖర్చులు అంచనాలకు మించి అవుతున్నాయని వాపోతున్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది చాలా తక్కువ. ఇదే సమయంలో ప్రైవేట్ ఆపరేటర్లు బస్సు చార్జీలను ఇష్టానుసారం పెంచేశారు. దసరా పండగ పూర్తి కావడంతో స్థానికులు శనివారం నుంచి తిరుగు ప్రయాణాలు మొదలు పెట్టారు. ఆదివారం ఎక్కువ మంది తిరుగు ప్రయాణానికి సిద్ధమవున్నారు. ఈ రోజున ప్రయివేట్ ఆపరేటర్లు చేస్తున్న దోపిడీ అంతాఇంతా కాదు. ఆకాశమే హద్దుగా టిక్కెట్ రేట్లు పెంచివేశారు.

మోయలేని భారం

కోనసీమ జిల్లా అమలాపురం, మురమళ్ల, రామచంద్రపురం, రావులపాలెం, రాజోలు తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు సాధారణ రోజుల్లో ప్రైవేట్ బస్సు టిక్కెట్ ధర నాన్ ఏసీ కూర్చుని వెళ్లేది రూ.400 నుంచి రూ.600 కాగా ఇప్పుడు అది రూ.1,300 నుంచి రూ.1,500 వరకు అవుతోంది. నాన్ ఏసీ స్లీపర్ టిక్కెట్ ధర రూ.1,500 నుంచి రూ.2,300 వరకు డిమాండ్ చేస్తున్నారు. ఇక ఏసీ కూర్చుని వెళ్లే టిక్కెట్ ధర రూ.1,400 నుంచి రూ.2 వేల వరకు ఉంది. స్లీపర్ అయితే రూ.మూడు వేల వరకు ధర చెల్లించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. వచ్చినప్పుడు, వెళ్లినప్పుడు కుటుంబానికి బస్సు ప్రయాణాల భారం రూ.10వేల నుంచి రూ.15 వేలకు పైబడి అవుతోంది. దీనికన్నా ఇంటి వద్దనే చేసుకుంటే మేలనే ఉద్దేశంతో దసరాకు వచ్చే సామాన్యులు చాలామంది ఆగిపోయారు.



ఆర్టీసీ బస్సు



ప్రైవేట్ బస్సు

అదనపు బాదుడు

ప్రైవేట్ బస్సులకు చెందిన యాప్‌లు, ఆన్‌లైన్‌లలో టిక్కెట్లు అమ్మకాలు అయిపోయినట్టు చూపుతున్నాయి. అయినా టిక్కెట్‌లు కావాలని నేరుగా అడుగుతుంటే ఇప్పుడు పెంచిన ధర కన్నా అదనంగా టిక్కెట్ రేట్లు చెబుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. బెంగళూరుకు రాజమహేంద్రవరం నుంచి మాత్రమే ఆర్టీసీ బస్సు అందుబాటులో ఉంది. చెన్నైకు అయితే అది కూడా లేదు. దీంతో స్థానికులు ప్రైవేట్ బస్సులను ఆశ్రయించాల్సి వస్తోంది. రాజమహేంద్రవరం, రావులపాలెం నుంచి బెంగళూరు స్లీపర్ టిక్కెట్ ధర రూ.4 వేల నుంచి రూ.ఐదు వేల వరకు ఉంది. చెన్నైకు రూ.3,500 నుంచి రూ.4 వేల వరకు అవుతోంది. రైల్వే టిక్కెట్‌లు రెండు నెలలు ముందే రిజర్వ్ అయిపోయి చాంతాడంత వైటింగ్ లిస్టు ఉండడంతో దూర ప్రాంతాలకు వెళ్లేవారికి ప్రైవేట్ బస్సులే శరణ్యమయ్యాయి.

ఆర్టీసీ బస్సులు అంతంత మాత్రమే

ఆర్టీసీ బస్సులు ఈసారి అంతంత మాత్రమే. అమలాపురం నుంచి హైదరాబాద్‌కు దసరా ప్రత్యేక బస్సులు ఈ నెల 4వ, 5వ, 6వ తేదీల్లో కేవలం మూడు చొప్పున మాత్రమే ఉన్నాయి. విజయవాడకు అదనంగా నాలుగు, విశాఖపట్నానికి నాలుగు చొప్పున అదనపు బస్సులు వేశారు. రామచంద్రపురం నుంచి హైదరాబాద్‌కు ఒకటి, విజయవాడకు ఒకటి చొప్పున వేశారు. రాజోలు నుంచి హైదరాబాద్‌కు కేవలం ఒకటి మాత్రమే ప్రత్యేక బస్సు నడుపుతున్నారు. మిగిలినవన్నీ రెగ్యులర్ బస్సులే. ప్రత్యేక బస్సులు నడిపే పరిస్థితి ఆర్టీసీలో లేదు. కొన్ని బస్సులు వేసినా అవి హైదరాబాద్‌తోపాటు విజయవాడ, విశాఖపట్నం, దసరా సందర్భంగా ఆలయాల సందర్శనలకు వేసిన బస్సులు కావడం గమనార్హం. దీనికితోడు ఇటీవల కాలం చెల్లిన, కండిషన్‌లో లేని బస్సులను తప్పించారు. ఉదాహరణకు అమలాపురం డిపో పరిధిలో ఇటీవల కాలం చెల్లిన, కండిషన్ లేని సుమారు 25 బస్సులను తొలగించారు. దీనివల్ల కూడా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు వేసే పరిస్థితి లేక చేతులు ఎత్తివేసింది. కూటమి ప్రభుత్వం కూడా ప్రత్యామ్నాయ మార్గాలు చూపించడం లేదు. పైగా ప్రైవేట్ ఆపరేటర్ల దోపిడీని దగ్గర ఉండి మరీ ప్రోత్సహిస్తోంది. దీనివల్ల ప్రైవేట్ ఆపరేటర్ల దోపిడీపై రవాణా శాఖ కూడా ఏం చేయలేని స్థితిలో దిక్కులు చూస్తోంది.

పోలీసుల ఆయుధ పూజ



జిల్లా ఆర్మ్‌డ్ కార్యాలయంలో విజయదుర్గకు ఆయుధ పూజ చేస్తున్న ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం టౌన్: విజయ దశమి సందర్భంగా అమలాపురంలోని జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వుడు (ఏఆర్) కార్యాలయంలో ఎస్పీ రాహుల్ మీనా ఆయుధ పూజ చేశారు. జిల్లాలో పోలీసులు వినియోగించే తుపాకులు, తదితర ఆయుధాలకు, పోలీస్ వాహనాలకు ఎస్పీ మీనా గురువారం శాస్త్రోక్తంగా పూజలు చేసి విజయ దుర్గను కొలిచారు. అనంతరం జిల్లా ప్రజలకు, పోలీసులకు ఆయన దసరా శుభాకాంక్షలు తెలిపారు. పురోహిత బ్రహ్మ ఉపద్రష్ట విజయాదిత్య సోదరులు ఎస్పీతో ఆయుధ పూజ చేయించారు. దుర్గాదేవి చిత్రపటం వద్ద ఉంచిన ఆయుధాలకు ఎస్పీ పూజలు చేశారు. విజయాలకు చిహ్నమైన విజయ దశమి అందరికీ విజయం చేకూర్చాలని, జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఎస్పీ మీనా ఆకాంక్షించారు. ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, ఏఆర్ ఆర్ఐ కోటేశ్వరరావు, పట్టణ, రూరల్ సీఐలు పి.వీరబాబు, డి.ప్రశాంత్‌కుమార్, క్రైమ్ సీఐ ఎం.గజేంద్రకుమార్, స్పెషల్ బ్రాంచి సీఐ పుల్లారావుతో పాటు ఎస్పీ, ఏఆర్ కార్యాలయాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి నివాళి

జాతి పిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం ఘనంగా జరిగాయి. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సెల్యూట్ చేశారు.

రత్నగిరికి భక్తుల తాకిడి

- సత్యదేవుని దర్శించిన 50 వేల మంది
- దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం



సత్యదేవుని సన్నిధిలో భక్తజన వాహిని

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని దర్శనానికి శుక్రవారం వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. దసరా సెలవులు ముగియడంతో స్వస్థలాలకు తిరిగి వెళ్తున్న వారితో పాటు ఇతర భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చారు. దీనికి తోడు గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున రత్నగిరిపై, ఇతర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవదంపతులు, వారి బంధుమిత్రులు కూడా సత్యదేవుని సన్నిధికి తరలి వచ్చారు. దీంతో, సత్యదేవుని ఆలయం, ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్త గోకులంలో ఏడు గోవులకు ప్రదక్షిణ చేసి, శ్రీకృష్ణునికి పూజలు చేశారు. సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సత్యదేవుని వ్రతాలు 2,500 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో 5 వేల మంది భక్తులు సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు. శని, ఆదివారాల్లో కూడా రత్నగిరిపై భక్తుల రద్దీ అధికంగా ఉండనుంది. స్వామి, అమ్మవార్లను ఆలయ ప్రాకారంలో శనివారం తిరుచ్చి వాహనం మీద, ఆదివారం టేకు రథ పైన ఉదయం 10 గంటలకు ఊరేగిస్తారు. విజయ దశమి పర్వదినం సందర్భంగా విజయవాడ కనక దుర్గమ్మ దర్శనానికి వెళ్లిన వేలాది మంది ఉత్తరాంధ్ర జిల్లాల భక్తులు తిరుగు ప్రయాణంలో అన్నవరంలో ఆగారు. రత్నగిరి తొలి పావంచా వద్ద కొబ్బరి కాయలు కొట్టి సత్యదేవుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తొలి పావంచా వద్ద తీవ్ర రద్దీ ఏర్పడింది. భక్తులు తమ వాహనాలను మెయిన్ రోడ్డుపై నిలిపివేయడంతో పలుమార్లు ట్రాఫిక్ స్తంభించిపోయింది.

విఘ్నేశ్వరుని ఆలయం కిటకిట

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయం విజయ దశమి, ఏకాదశి పర్వదినాల సందర్భంగా గురు, శుక్రవారాల్లో కిటకిటలాడింది స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావు స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. 719 మంది తమ నూతన వాహనాలకు పూజలు చేయించారు. 71 మంది స్వామివారి ప్రత్యేక అభిషేకాల్లో పాల్గొన్నారు. 6,100 మంది స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. స్వామివారికి రూ.9,63,297 వివిధ పూజా టికెట్లు, ప్రసాదాలు, అన్నదాన విరాళాల ద్వారా ఆదాయం లభించినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.



నూతన వాహనాలకు పూజలు చేయిస్తున్న భక్తులు

శంకరగుప్తంపై రీ ఎస్టిమేషన్



కేశనపల్లిలో చనిపోయిన కొబ్బరి చెట్లను పరిశీలించిన మంత్రి నిమ్మల తదితరులు

సాక్షి ఇంపాక్ట్

మలికిపురం: రాజోలు దీవిలో రైతుల పాలిట దుఃఖ: దాయనిగా మారిన శంకరగుప్తం మేజర్ డ్రైన్ అభివృద్ధిపై తక్షణమే రీ ఎస్టిమేషన్ వేయాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. డ్రైన్ ముంపు, చనిపోయిన లక్షలాది కొబ్బరి చెట్లు, రైతుల దుస్థితిపై ఇటీవల ×సాక్షి×లో వరుస కథనాలు ప్రచురణ అయ్యాయి. స్పందించిన ప్రభుత్వం రంగంలోంకి దిగింది. డ్రైన్ మరమ్మతులకు ఇప్పటికే అంచనా వేసిన రూ.17 కోట్లు సరిపోవనే అంశాలన్ని కూడా సాక్షి పత్రిక ప్రస్తావించింది. గురువారం మంత్రి నిమ్మల రాజోలు నియోజక వర్గం కేశనపల్లిలో శంకరగుప్తం డ్రైన్ ముంపు వల్ల చనిపోయిన కొబ్బరి చెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. 24 కిలోమీటర్ల పొడవు గల ఈ డ్రైన్‌లో డ్రెడ్జింగ్‌తో పాటు పటిష్ఠంగా ఏటి గట్ల నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉందన్నారు. రీ ఎస్టిమేట్ వేయాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్, ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన దసరా సంబరాలు

- గగుర్పాటు కలిగించిన చెడీ తాలింఖానా విన్యాసాలు
- కత్తులు తిప్పిన ప్రజాప్రతినిధులు



అమలాపురం వీధుల్లో సాగుతున్న దసరా ఉత్సవాల ఊరేగింపు



రవణం వీధి మహిషాసుర మర్దినిదేవికి పూజలు చేస్తున్న డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా



కళ్లకు గంతలు కట్టుకుని మనిషి పీకపై ఉన్న కొబ్బరి కాయను పట్టా కత్తితో పగలుగొడుతున్న దృశ్యం

అమలాపురం టౌన్: విజయ దశమి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచిన అమలాపురం దసరా ఉత్సవాలు, ఊరేగింపుల సంబరాలు గురువారం అంబరాన్ని అంటాయి. పట్టణంలోని ఏడు వీధులైన కొంకాపల్లి, మహిపాల వీధి, నల్లా వీధి, గండు వీధి, రవణం వీధి, శ్రీరామపురం, రవణం మల్లయ్యవీధిలకు చెందిన దేవతా మూర్తుల వాహనాలతో ఊరేగింపులు వైభవంగా జరిగాయి. జిల్లాలోని వారే కాకుండా సుదూర ప్రాంతాల్లో ఉంటున్న వారంతా అమలాపురానికి తరలివచ్చి దసరా ఊరేగింపులను వీక్షించారు. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు ఏడు వీధుల ఊరేగింపుల సమ్మేళనంతో ఉత్సవాలు జరిగాయి. ఊరేగింపుల్లో చెడీ తాలింఖానా ప్రదర్శనలు ఉత్కంఠ భరితంగా, గగుర్పాటు కలిగించేలా సాగాయి. కళ్లకు గంతలు కట్టుకుని నేలపై పడుకున్న వ్యక్తి ఉదరం, పీకలపై కొబ్బరి కాయలు, కూరగాయలు ఉంచి పట్టా కత్తితో నరికే సన్నివేశాలను చూసేందుకు జనం ఎగబడ్డారు. అగ్గి బరాటాల విన్యాసాలు, లేడి కొమ్ములు, బల్లేలతో పోరాటాలు, కర్ర సాముతో సాగిన ప్రదర్శనలతో ఊరేగింపులు హోరెత్తాయి. రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీలు గంటి హరీష్‌మాధుర్, సానా సతీష్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పలు వీధుల దసరా ఉరేగింపుల్లో పాల్గొని కొద్దిసేపు సరదాగా కత్తులు తిప్పారు. అమలాపురానికి చెందిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ ఊరేగింపుల్లో పాల్గొని సరదాగా కత్తులు,కర్రలు తిప్పారు.



కత్తి దూస్తున్న అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్



కొంకాపల్లి దసరా ఊరేగింపులో కత్తి తిప్పుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

ఎస్పీ రాహుల్ మీనా ఆధ్వర్యంలో అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో దాదాపు 500 మంది పోలీసు బలగాలతో బందోబస్తు నిర్వహించారు. ఏడు వీధుల ఊరేగింపుల వద్ద అడుగడుగునా పోలీసులు వలయంగా మోహరించి ఆయుధాల ప్రదర్శనలతో సాగిన చెడీ తాలింఖానా బృందాలను పర్యవేక్షించారు. ఏడు వీధుల ఊరేగింపులతో అమలాపురం పట్టణం కత్తుల సవ్వడితో హోరెత్తింది. చెడీ తాలింఖానా ప్రదర్శనలకు తోడు ప్రతీ వీధి ఊరేగింపులో శక్తి వేషాలు, తీన్ మార్ డప్పులు ఇలా ఎన్నో సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అమలాపురంలో ఊరేగింపులు సాగిన మెయిన్ రోడ్లన్నీ జనం రద్దీతో నిండిపోయాయి. ఇళ్ల అరుగులపై, డాబాలపై ఎటు చూసినా జనమే. వారు ఊరేగింపులను ఉత్కంఠగా, ఉత్సాహంగా తిలకించారు.

ఊరేగింపులను వీక్షించిన డీఐజీ

ఏడు వీధుల దసరా ఊరేగింపుల సమ్మేళనాన్ని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ శుక్రవారం తెల్లవారు జామున వీక్షించారు. గడియారం స్తంభం సెంటరులోని పట్టణ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వద్ద ఐజీ, ఎస్పీ, ఏఎస్పీలు ఊరేగింపులను దాదాపు గంటన్నర పాటు వీక్షించారు. ఊరేగింపుల్లో భాగంగా రవణం వీధి మహిషాసుర మర్దినిదేవి ఉత్సవ వాహనానికి ఐజీ, ఎస్పీలు ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

రైల్వే ఫ్లై ఓవర్ కింద యువకుడి మృతదేహం

గుర్తు పట్టలేనంతగా ముఖంపై గాయాలు

తుని: పట్టణంలో రైల్వే ఫ్లైఓవర్ కింద నర్సీపట్నం బస్టాండ్ సమీపంలో యువకుడి మృతదేహం ఉండటం శుక్రవారం ఉదయం కలకలం రేపింది. దారుణమైన గాయాలతో, ముఖాన్ని గుర్తుపట్టలేనంతగా ఉన్న మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ శ్రీహరిరాజు, తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఇతర పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను, క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ముఖంపై ఉన్న గాయాలను బట్టి కొట్టి చంపేసినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే యువకుడు ఎవరనేది వివరాలు తెలియకపోవడంతో ఈ ఘటన స్థానికంగా జరిగిందా లేక వేరే ప్రాంతంలో కొట్టి చంపి ఇక్కడకు తీసుకొచ్చి పడేశారా? అన్నకోణంలో పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం ముఖం మీద తప్ప శరీరంపై ఎక్కడ గాయాలు కనిపించడం లేదు. సమీపంలో ఉన్న ఒక మద్యం బాటిల్‌ను పోలీసులు సేకరించి అది ఎక్కడ కొనుగోలు చేసిందనే దానిపై ఆరా తీస్తున్నారు. చనిపోయిన వ్యక్తి సమాచారం తెలుసుకునేందుకు పోలీసులు విచారణ జరుపుతున్నారు. సిబ్బంది మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సౌత్ ఏషియన్ బాక్సింగ్‌కు యోగితాకుమారి



బంగారు పతకం గెలుచుకున్న యోగితాకుమారి

మామిడికుదురు: ఎస్‌జీఎఫ్‌ఐ సౌత్ ఏషియన్ బాక్సింగ్ పోటీలకు గెద్దాడ గ్రామానికి చెందిన చిట్టూరి యోగితాకుమారి ఎంపికైంది. ఈ పోటీలు త్వరలో బెంగళూరులో జరుగుతాయని జాతీయ బాక్సింగ్ కోచ్ చిట్టూరి చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. సీఐఎస్‌సీఈ జాతీయ బాక్సింగ్ పోటీలు గత నెల 25 నుంచి 27 వరకు మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరిగాయి. ఆ పోటీల్లో 48 కిలోల విభాగంలో యోగితాకుమారి బంగారు పతకం గెలుపొందిందని చంద్రశేఖర్ తెలిపారు. తద్వారా సౌత్ ఏషియన్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైందన్నారు. యోగితాకుమారి ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

ప్రాణ సంకటంగా బాణసంచా

- తయారీ కేంద్రాలపై నిఘా అవసరం
- ప్రమాదాల నుంచి పాఠాలు నేర్వాలి
- దీపావళి వేళ అప్రమత్తతే రక్ష

ప్రమాదాల్లో కొన్ని..

తేదీ	ఊరు	మృతులు
2012 డిసెంబర్ 30	వి.సావరం (రాయవరం)	3
2014 అక్టోబర్ 22	వాకతిప్ప(యు.కొత్తపల్లి)	18
2015 జూలై 22	పలివెల (కొత్తపేట మండలం)	5
2025 సెప్టెంబర్ 30	విలస (అయినవిల్లి మండలం)	2

రాయవరం: దీపావళి పండగ అంటే చిన్నా, పెద్దా అందరికీ ఆనందమే. ఈ నెల 21న దీపావళి పర్వదినం జరుపుకొనేందుకు జనం సన్నద్ధమవుతున్నారు. అయితే జీవితంలో వెలుగులు నింపాల్సిన దీపావళి పండగ..కొందరి స్వార్థంతో చీకట్లను తెస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా, అజాగ్రత్తగా బాణసంచా తయారీ, నిల్వలు చేస్తుండడంతో అనేక మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఏటా ఇలాంటి దుర్ఘటనలు జిల్లాలో చోటు చేసుకుంటున్నాయి. దీపావళి పండగ అంటేనే బాణసంచా కాల్చడం. లైసెన్స్ పొందినవారు బాణసంచా తయారీలో నిమగ్నమయ్యారు. అధికారికంగా బాణసంచా తయారీ చేసే వారికంటే అనధికారికంగా చేసేవారు ఎక్కువ. గతంలో అధికారికంగా బాణసంచా తయారీ చేసే కేంద్రాలతో పాటు అనధికారికంగా బాణసంచా తయారీ చేసే చోట కూడా ప్రమాదాలు సంభవించి అధిక సంఖ్యలో ప్రాణాలు కోల్పోయిన ఘటనలున్నాయి.

45 వరకు బాణసంచా తయారీ కేంద్రాలు

దీపావళికే కాక పలు సందర్భాల కోసం బాణసంచా తయారు చేస్తుంటారు. ప్రస్తుతం దీపావళికి బాణసంచా తయారు చేసే పనిలో జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని వేట్లపాలెం, జువ్విపాడు, ద్రాక్షారామ, వేళంగి, రాయవరం, వి.సావరం, కొమరిపాలెం, బిక్కవోలు, మండపేట తదితర ప్రాంతాల్లో తయారీ కేంద్రాలున్నాయి. ఏడాది పొడవునా ఇక్కడి వ్యాపారులకు చేతినిండా పని ఉంటుంది. బాణసంచా తయారీ కోసం ఫారమ్ 20, కేవలం అమ్మకం కోసం ఫారమ్ 24 జారీ చేస్తారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 50కి పైగా లైసెన్స్‌డ్ తయారీ కేంద్రాలు ఉన్నాయి.

అతి పెద్ద ఘటన అదే

బాణసంచా తయారీ సందర్భాల్లో అనేక ప్రమాదాలు జిల్లాలో చోటు చేసుకున్నాయి. జిల్లాలోని మండపేట, జువ్విపాడు, ద్రాక్షారామ, కొమరిపాలెం, రాయవరం, బిక్కవోలు, యు.కొత్తపల్లి మండలం వాకతిప్ప తదితర చోట్ల బాణసంచా కేంద్రాల్లో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అయితే వాకతిప్పలో 2014 అక్టోబర్ 22వ తేదీన చోటు చేసుకున్న ఘటన జిల్లాలోనే అతి పెద్ద దుర్ఘటనగా చెప్పవచ్చు. ఈ ప్రమాదంలో 18 మంది మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాద ఘటన అనేక లోపాలను ఎత్తిచూపింది. గతేడాది మండపేట మండలం ఏడిదలో దీపావళి ముందు రోజు జరిగిన దుర్ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీన కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం విలస గ్రామంలో తాము నిర్వహిస్తున్న కిరాణా షాపులో బాణసంచా పేలి భార్యాభర్తలు కంచర్ల శ్రీనివాసరావు, సీతామహాలక్ష్మి మృతిచెందారు.

అనధికార నిల్వలతోనే..

బాణసంచా తయారీకి పేరొందిన తమిళనాడులోని శివకాశి నుంచే రాష్ట్రానికి ఎక్కువగా సరకు దిగుమతి అవుతుంది. చైనా బాణసంచా కూడా అధికంగానే దిగుమతి చేసుకుంటున్నారు. పలువురు వ్యాపారులు దీపావళికి బాణసంచాను దిగుమతి చేసుకుని నిల్వలు పెట్టుకుంటారు. నిబంధనలు అతిక్రమించి గోడౌన్లలో నిల్వలు చేస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. బాణసంచా గోడౌన్ ఏర్పాటు చేయాలంటే ఫారం-26 ప్రకారం అధికారులు అనుమతి ఇవ్వాల్సి ఉంది. జనావాస ప్రాంతంలో బాణసంచా నిల్వలు ఏర్పాటు చేయరాదు. అగ్నిమాపక నిబంధనలు పాటిస్తూ, గ్రామ శివారు ప్రాంతాల్లోనే బాణసంచా కేంద్రాలను నెలకొల్పాలి. మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలి. ఇవేమీ పాటించకుండా కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొంతమంది లైసెన్స్‌లు పొందకుండానే జనావాసాల మధ్య అవగాహన లేకుండా అనధికారికంగా బాణసంచా తయారు చేయడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.



బాణసంచా తయారు చేస్తున్న కార్మికులు (ఫైల్)



బాణసంచా ప్రమాదం (ఫైల్)

బాణసంచా తయారీదారులు పాటించాల్సిన నిబంధనలు

- బాణసంచా తయారీ కేంద్రం చుట్టూ 9 మీటర్ల ఖాళీ స్థలం ఉంచాలి.
- అగ్నిమాపక సిబ్బంది విధులు నిర్వర్తించేందుకు అనువుగా నాలుగువైపులా 9 మీటర్ల మేర ఖాళీ స్థలం ఉండాలి.
- గ్రామ పంచాయతీ, పట్టణాలకు 1.5 కిలోమీటర్లలోపు మందుగుండు సామగ్రి తయారు చేయకూడదు.
- బాణసంచా తయారుచేసే ప్రదేశాల్లో అగ్నినిరోధక పరికరాలు ఉండాలి.
- షెడ్ల నిర్మాణానికి ఉపయోగించే మెటీరియల్ కనీసం రెండు గంటల పాటు అగ్నిని నిరోధించగలగాలి.
- షెడ్ల నుంచి బయటకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన గుమ్మాలు కనీసం 100 సెంటీమీటర్ల వెడల్పు, 200 సెంటీమీటర్ల ఎత్తు కలిగి ఉండాలి.
- తయారీ కేంద్రంలో ఆటోమెటిక్ వెంటిలేషన్ సిస్టమ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.
- 18 ఏళ్లలోపు పిల్లలను, మహిళలను బాణసంచా తయారీకి ఉపయోగించకూడదు.
- అక్కడ పనిచేసే ఉద్యోగులు తప్పనిసరిగా ఫైర్‌ఫైటింగ్ కోర్సులో ప్రాథమిక శిక్షణ తీసుకుని ఉండాలి.
- తయారీ కేంద్రం విస్తీర్ణాన్ని బట్టి 5 కిలోల సామర్థ్యం ఉన్న డ్రై పౌడర్ ఎస్టింగ్విషర్ (అగ్నిమాపక సిలిండర్)లు నాలుగు సిద్ధంగా ఉండాలి.
- ఐదు ట్రక్కుల పొడి ఇసుకను కూడా ఆ ఆవరణలో సిద్ధంగా ఉంచాలి.
- ప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక సిబ్బందికి అవసరమైన నీటి కోసం తగిన ఏర్పాట్లు చేసుకోవాలి.
- మంటలు, అగ్నిని సృష్టించే ద్రవ పదార్థాలు (పెట్రోలు, డీజిల్ వంటివి) ఎట్టి పరిస్థితుల్లోనూ తయారీ కేంద్రాల్లో నిల్వ ఉంచకూడదు.
- తయారీ కేంద్రంలో విద్యుద్దీకరణలోను జాగ్రత్తలు పాటించాలి. వైర్లను బహిరంగంగా ఉంచకూడదు. వైర్ల జాయింట్లు ఎక్కడా ఉండకూడదు.
- తయారీ కేంద్రంలో వ్యర్థ పదార్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి.
- నీరు, పొడి ఇసుకను నింపిన బకెట్లు సిద్ధంగా ఉంచాలి.
- బయటి వ్యక్తులు అక్కడికి వెళ్లకుండా చూడాలి.
- అత్యవసర సమయంలో అలారం మోగించేందుకు, అవసరమైతే లోపలి వారిని బయటకు తీసుకువచ్చేందుకు తగినంత సిబ్బందిని సిద్ధంగా ఉంచాలి.
- అగ్నిప్రమాద సమాచారాన్ని అత్యవసరంగా తెలియజేసేందుకు ఫోన్లు అందుబాటులో ఉంచాలి.
- మందుతున్న బాణసంచాను ఎట్టి పరిస్థితుల్లోనూ లోపల ఉంచకూడదు.
- ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అందులో మందులు సిద్ధంగా ఉంచాలి.
- ఈ నిబంధనలను పాటించకుంటే లైసెన్సు రద్దు అవుతుంది.
- ఎక్స్‌ప్లోజివ్ యాక్టు ప్రకారం బాణసంచా తయారు చేసే షెడ్లు, ప్లాట్‌ఫారం తగినంత దూరంలో ఉండాలి.

అనధికార తయారీదారులతోనే సమస్య



జిల్లాలో లైసెన్స్ పొందిన బాణసంచా తయారీదారులు కచ్చితమైన నిబంధనలు పాటిస్తున్నారు. దీపావళిని పురస్కరించుకుని పలువురు అనధికారికంగా జనావాసాల మధ్య బాణసంచా తయారు చేయడం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పోలీస్, ఫైర్ అధికారులు వచ్చి తరచుగా తనిఖీలు చేపడుతున్నారు.

– వి.సత్యనారాయణమూర్తి, గౌరవ అధ్యక్షుడు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాణసంచా తయారీ యజమానుల సంఘం, రాయవరం

రాజీపడే ప్రసక్తి లేదు



బాణసంచా తయారీ కేంద్రాలు కచ్చితంగా నియమ నిబంధనలు పాటించాలి. అప్పుడే రెన్యువల్ లైసెన్స్‌లకు సిఫారసు చేస్తాం. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. అధికారిక తయారీ కేంద్రాల్లో తరచుగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. అనధికారికంగా తయారు చేస్తున్నట్లుగా సమాచారం ఉంటే మా దృష్టికి తీసుకుని రావాలి.

– బి.రఘువీర్, డీఎస్పీ, రామచంద్రపురం

న్యాయం చేయాలంటూ ధర్నా



క్షతగాత్రురాలితో పాటు ధర్నాలో పాల్గొన్న సర్పంచ్ తదితరులు

పెద్దాపురం (సామర్లకోట): పెద్దాపురం మండలం జి.రాగంపేటలోని బ్లూ ఓషన్ కంపెనీ యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి నిరసగా శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికురాలు లొల్ల దుర్గమ్మను గత నెల ఏడవ తేదీన ఫ్యాక్టరీకి చెందిన వాహనం ఢీ కొనడంతో రెండు కాళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఆమెకు చెందిన ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా వైద్యం చేయించి ఇంటికి పంపించి వేశారు. అయితే ఆమెకు ఫ్యాక్టరీ యాజమాన్యం ఆర్థిక సహాయం అందించకపోవడంతో పాటు ఆమె ఆరోగ్య పరిస్థితిపై శ్రద్ధ చూపలేదు. దాంతో ఆమె కుటుంబ సభ్యులు ధర్నా చేయడానికి నిర్ణయించారు. ఆమెకు జి. రాగంపేట సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు బుంగా శేఖర్‌బాబు, ప్రజలు మద్దతు ఇచ్చి ధర్నాలో పాల్గొన్నారు. ఫ్యాక్టరీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. భర్త పని చేయలేని పరిస్థితిలో ఉండటంతో ఫ్యాక్టరీలో ఆమె పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకొంటోందని చెప్పారు. దుర్గమ్మ మంచాన పడటంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతుందని తెలిపారు. దుర్గమ్మకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బంగారు కృష్ణ, గ్రామ నాయకులు కల్యాణ్, బాబీ, విజయ్‌లు ఆందోళన కార్యక్రమానికి మద్దతు ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- ఒకరికి తీవ్ర గాయాలు
- మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన కారు



ప్రమాదానికి కారణమైన ఇన్నోవా కారు



ఇస్సాకు మృతదేహం



పోసియ్య మృతదేహం

పెరవలి: విజయ దశమి రోజున జరిగిన రోడ్డు ప్రమాదం మూడు కుటుంబాల్లో విషాదం నింపింది. జాతీయ రహదారిపై పెరవలి మండలం నల్లాకులవారిపాలెం వద్ద మోటార్ సైకిల్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా ఒకరు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పెరవలి ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గురువారం రాత్రి 9.20 గంటలకు నల్లాకులవారిపాలెం వద్ద రోడ్డు కట్టింగ్‌ను దాటే సమయంలో రావులపాలెం నుంచి తణుకు వైపు వస్తున్న ఇన్నోవా కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో మోటార్ సైకిల్‌పై ఉన్న ముగ్గురు గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడటంతో పాటు వారిపై నుంచి కారు దూసుకుపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సపర్యలు చేసినా ఫలితం లేకపోయింది. ప్రమాదంలో ఇంజేటి ఇస్సాకు (49)పై కారు వెళ్లటంతో తీవ్ర గాయాలు అయి రక్తపు మడుగులో కొట్టుకుంటూ మృతి చెందాడు. కంతేటి పోసయ్య (29) కారు ఢీకొట్టిన వేగానికి గాలిలోకి ఎగిరి రోడ్డు మధ్యలో ఉండే డివైడర్‌పై పడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. బాతు వెంకటేశ్వరరావు ప్రమాద సమయంలో గాలిలోకి ఎగిరి రోడ్డుపై పడటంతో తీవ్రగాయాలై కొట్టుకుంటుండగా స్థానికులు 108లో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు అక్కడ నుంచి విజయవాడ, అక్కడ నుంచి గుంటూరు ఆసుపత్రికి తరలించారు.

వెనక్కి వెళ్లిపోదామనుకోగా...

పండగ రోజు కావటంతో స్నేహితులు ముగ్గురు కలసి ఖండవల్లి నుంచి తణుకు వెళ్లటానికి మోటార్ సైకిల్‌పై వస్తుండగా నల్లాకులవారిపాలెం వచ్చేటప్పటికి తిరిగి ఖండవల్లి వెళ్లిపోదామని ఉద్దేశంతో మోటార్ సైకిల్ టర్నింగ్ తిప్పటంతో అదే సమయంలో రావులపాలెం నుంచి తణుకు వస్తున్న కారు వేగంగా ఢీకొని ఈ ప్రమాదం జరిగింది. దీనికితో కారు ఢీకొట్టిన వెంటనే అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందగా, మరొకరు తీవ్రగాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

కన్నీటి సంద్రమైన ఖండవల్లి

ప్రమాదం జరిగిందని తెలిసిన ఖండవల్లిలో మూడు కుటుంబాలు కన్నీటి పర్యంతం అయ్యాయి. పండగ రోజు ఎంతో ఆనందంగా గడిపిన ఈ ముగ్గురు స్నేహితులు రాత్రి అయ్యే సమయానికి మృతి చెందటంతో ఆ కుటుంబాలు కన్నీటిలో మునిగిపోయాయి. గ్రామస్తులు ప్రమాద స్థలానికి వెళ్లి అక్కడ కనిపించిన భయానక దృశ్యాలను చూచి కన్నీరు పెట్టుకున్నారు. మృతుడు పోసియ్య భార్య కనకదుర్గ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్వరావు తెలిపారు.

నవంబర్ నెల కల్యాణాలు విడుదల

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయం 2025 నవంబర్ నెలకు సంబంధించి నిత్యకల్యాణాలు గురువారం విడుదల చేసినట్లు ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి వి.సత్యనారాయణ తెలిపారు. మొత్తం 30 రోజులకు సంబంధించి 3,480 కల్యాణాలకు ఆన్‌లైన్‌లో 2,040, కార్యాలయంలో 1,440 అందుబాటులో ఉంటాయన్నారు. ఆన్‌లైన్‌లోగాని, నేరుగాని నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. కార్తికమాసం నెల రోజులు స్వామి వారి నిజరూప లింగానికి పంచామృతాభిషేకంతోపాటు అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించి నిత్య, మాస, వార్షిక పూజలు రుద్ర హోమం, చండీ హోమం, లక్ష పత్రి పూజ, ద్వాదశ పుష్కర నదీ జలాభిషేకం టిక్కెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెళ్లకు గాయాలు

సామర్లకోట: అడ్డతీగల నుంచి కాకినాడ వెళుతున్న అన్నా చెల్లెళ్లను లారీ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం శుక్రవారం సామర్లకోట – కాకినాడ రోడ్డులో స్థానిక పంచారామ క్షేత్ర ఇనుప వంతెన సమీపంలో లారీ మోటారు సైకిల్‌ను ఢీకొంది. దాంతో అన్నా చెల్లెళ్లు సత్తిరెడ్డి, శిరీష తీవ్రంగా గాయపడ్డారు. శిరీష విశాఖపట్నంలో ఒక ప్రయివేటు కళాశాలలో చదువుతూ సెలవులకు అడ్డతీగల వచ్చింది. కాకినాడలోని పెద్దమ్మ ఇంటికి వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్టు క్షతగాత్రుల బంధువులు తెలిపారు. క్షతగ్రాతులను కాకినాడలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. శిరీష పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. సామర్లకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్‌ఐ టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు



అండర్-14, 17 టెన్నిస్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడాసమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడామైదానంలోని టెన్నిస్ కోర్టులలో బాలబాలికల ఎంపికలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-14, 17 కార్యదర్శి శ్రీనివాస్ ప్రారంభించారు. జిల్లా స్థాయిలో జరిగిన ఎంపికలకు 70 మంది హాజరయ్యారు. టెన్నిస్ కోచ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు నిర్వహించారు. ఎంపికల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి మాచరరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు, సీనియర్ పీడీలు ఎల్.జార్జి, పట్టాభిరామం పాల్గొన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్లు ఎంపిక నిర్వహించామన్నారు. అండర్-14 బాలురు-5, బాలికలు-5, అండర్-17 బాలురు-5, బాలికలు-5 మందిని ఎంపిక చేశారు. ఎంపికలు ఎస్‌జీఎఫ్‌ఐ బాలికల కార్యదర్శి సుధారాణి పర్యవేక్షించారు.

గాడాల ఘటనలో నలుగురి అరెస్టు

కోరుకొండ: మండలంలోని మధురపూడికి చెందిన పాముల శ్రీను అనే దళిత యువకుడిని దారుణంగా కొట్టిన ఘటనలో నలుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్టు నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. గురువారం కోరుకొండ పోలీసుస్టేషన్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబరు 30వ తేదీన గాడాల మద్యం దుకాణం వద్ద రెండువర్గాలకు ఘర్షణ తలెత్తిందని, పాముల శ్రీనును స్తంభానికి కట్టి తీవ్రంగా కొట్టారని చెప్పారు. బాధితుడు శ్రీనును రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు తరలించామని, బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. నలుగురు ప్రధాన నిందితులను అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. ఈ కేసులో మరికొంత పరారీలో ఉన్నారన్నారు. సీఐ సత్యకిషోర్, ఎస్సై నాగార్జున పాల్గొన్నారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న ఆటో : వ్యక్తి మృతి

రంగంపేట: స్థానిక విశాఖ డెయిరీ ఎదురుగా ఏడీబీ రోడ్డుపై శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్టు ఎస్‌ఐ ఎస్.శివప్రసాద్ తెలిపారు. పెద్దాపురానికి చెందిన పరస కిరణ్‌కుమార్ (48) పట్టణంలో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడన్నారు. మెడిసిన్స్ కొనుగోలు నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం మోటారు సైకిల్ పై రాజమహేంద్రవరం వెళుతుండగా రంగంపేట విశాఖ డెయిరీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న పాసింజర్ ఆటో బలంగా ఢీకొనడంతో కిరణ్‌కుమార్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడు కిరణ్‌కుమార్ కుమారుడు పరస విఘ్నేష్‌సాయి శ్రీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

రైలు ఢీకొని జార్ఖండ్ వాసి మృతి



మృతుడు పాన్ (ఫైల్)

తుని: అన్నవరం రైల్వేస్టేషన్ ట్రాక్‌పై గుర్తుతెలియని రైలు ఢీకొని జార్ఖండ్ వాసి మృతి చెందిన ఘటన గురువారం జరిగిందని సామర్లకోట రైల్వే సబ్ ఇన్‌స్పెక్టర్ పి.వాసు తెలిపారు. మృతుని వద్ద తుని రైల్వే హెడ్ కానిస్టేబుల్ మోహన్‌రావుకు దొరికిన ఆధారాలను బట్టి జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన హోనార్ గ్రామానికి చెందిన సులం పాన్(25)గా తెలిసింది. మృతుడికి తండ్రి మంగళ్‌సింగ్ పాన్, తల్లి, ముగ్గురు తమ్ముళ్లు, చెల్లి ఉన్నట్టు కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది. కొంతకాలం నుంచి మానసికంగా మృతుడు ఇబ్బంది పడుతున్నట్టు వివరించారు. సుమారు నెల క్రితం చేపల చెరువు వద్ద ప్యాకింగ్ నిమిత్తం వచ్చినట్టు వివరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఉమ్మడి జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్‌గా గణేశ్



కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్‌గా అడారి గణేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు భీమవరం జిల్లా ట్రెజరీ శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్, అకౌంట్ ఆఫీసర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్‌గా గణేశ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయనను మర్యాద పూర్వకంగా ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ ఉద్యోగుల సంఘం అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు పాము శ్రీనివాసరావు, ఉద్యోగులు కలిశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదానికి గురైన ఆటో

రాయవరం: మండలంలోని వెంటూరు శివారు బుట్టాయిపేట వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో దుగ్గిరాల రాంబాబు(57) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయాన్ని రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు శుక్రవారం విలేకరులకు తెలిపారు. రాంబాబు కుటుంబ సభ్యులు వెంటూరు నుంచి రామచంద్రపురంలో బంధువుల ఇంటి వద్ద జరిగిన శుభ కార్యానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఆటో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో కూర్చున్న రాంబాబుకు తీవ్రగాయాలు కాగా, రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. రాంబాబు తమ్ముడు కుమారస్వామి ఆటో నడుపుతుండగా ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో ఆరుగురు ప్రయాణిస్తున్నారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయన్నారు. రాంబాబు కుమారుడు కనకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

వృద్ధుడి గల్లంతు



ఉల్లూరి చిరంజీవి (ఫైల్)

నిడదవోలు రూరల్: బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ గోదావరిలోకి జారిపడి వృద్ధుడు గల్లంతైనట్టు సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు శుక్రవారం తెలిపారు. నిడదవోలు మండలం పెండ్యాల గ్రామానికి చెందిన ఉల్లూరి చిరంజీవి (64) ఈ నెల 2వ తేదీ ఉదయం 10 గంటలకు గోదావరి ఒడ్డున బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ జారిపడిపోయాడు. చిరంజీవి అల్లుడు ప్రత్తిపాటి శ్రీను ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి గోదావరిలో గజ ఈతగాళ్లతో గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని కొవ్వూరు ఆర్డీఓ రాణిసుస్మిత, తహసీల్దార్ బి.నాగరాజునాయక్, ఎంపీడీఓ జగన్నాథరావు శుక్రవారం పరిశీలించారు.